క్లుప్తంగా

నేడు మున్సిపల్ సర్వసభ్య సమావేశం

రాయచోటి అర్బన్ : రాయచోటి మున్సిపల్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా తెలిపారు. ఉదయం 11:30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని వైఎస్ఆర్ సభా భవనంలో సమావేశం నిర్వహింపబడుతుందన్నారు. సమావేశంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ ఆమోదం కోసం సమావేశంలో చర్చ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, అన్నిశాఖల అధికారులు హాజరవుతారన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

రాజంపేట : రాజంపేట ఆర్టీసీ డిపో కార్యాలయంలో మంగళవారం డయల్ యువర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు డీఎం గుండాల రమణయ్య ఇక్కడి విలేకర్లకు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు జరిగే కార్యక్రమానికి ప్రజలు ఫోన్ చేసి ఆర్టీసీ పరమైన సమస్యలను తెలియజేస్తే, పరిష్కరిస్తామన్నారు. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల ప్రాంతీయులు డయల్ యువర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్‌బాబు

చిన్నమండెం : ప్రస్తుతం సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని వాటిపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రమేష్‌బాబు ప్రజలకు సూచించారు. సోమవారం మండల పరిధిలోని పడమటికోన గ్రామం బోడిరెడ్డిగారిపల్లె క్రాస్ రోడ్డు వద్ద సైబర్ నేరాలు, ప్రమాదకర వాహన ప్రయాణం, ఓటీపీ నేరాలు, లోన్ యాప్స్ వలన ప్రమాదాలు మొదలగు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి సైబర్ నేరాలకు లోను కావద్దని ఆయన సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే తమకు సమాచారం అందించాలని ఎస్ఐ సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రోగులకు అన్నదానం



ఆహార పొట్లాలను పంపిణీ చేస్తున్న దివ్యాంగుల సంఘం నేతలు

రాయచోటి అర్బన్ : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సోమవారం అన్నదానం కార్యక్రమం జరిగింది. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకుని దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పోరెడ్డి వెంకటరెడ్డి, బంద్రేవు రాజశేఖరరెడ్డిల ఆర్థికసహాయంతో ఆసుపత్రిలోని రోగులకు, ఇతరులకు అన్నదానం పొట్లాలను అందజేశారు.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

రాజంపేట రూరల్ : కడపలోని చిన్నచౌక్ గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో విద్యనభ్యసిస్తూ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన ఆకేపాడు పంచాయతీ శ్రీరంగరాజపురం అరుంధతివాడకు చెందిన ఓబిలి పెంచలమ్మ కుటుంబానికి రూ. 2 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అందజేశారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో సోమవారం పెంచలమ్మ తల్లిదండ్రులైన ఓబిలి తిరుపాల్, బుజ్జమ్మలకు చెక్కును అందజేసిన ఆకేపాటి వారికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఆకేపాటి సోదరుడు, సీనియర్ నాయకులు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, నాయకులు పాపినేని వేణుగోపాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటయ్య, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ భాషతో భవిష్యత్

పుల్లంపేట : కృష్ణంపల్లె ప్రాథమిక పాఠశాలలో హైదరాబాద్ హిందీ ప్రచార సభ పరీక్ష ప్రథమ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రమాణ పత్రాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సి.రమణమూర్తి ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ హిందీ ప్రచార సభ పరీక్షల నిర్వాహకుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు హిందీ పరీక్షలు రాయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలనరసింహులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తీరిన రోడ్డు సమస్య



సిమెంట్ రోడ్డును వేస్తున్న దృశ్యం

చిన్నమండెం : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 3న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డిలకు దారి సమస్యపై గ్రామస్తులు వారి దృష్టికి తీసుకువచ్చారు. ఇచ్చిన హామీ మేరకు రూ.15 లక్షల నిధులతో రోడ్డు పనులను శుక్రవారం సర్పంచ్ లక్ష్మిరెడ్డి ప్రారంభించారు.

అంతటా హోరెత్తిన రామనామస్మరణ

- బాలరాముడు అయోధ్యలో కొలువైన వేళ
- ఆనందపరవశితులైన రామభక్తులు
- రామాలయాల్లో విశేష పూజలు
- గ్రామోత్సవాలతో సందడి వాతావరణం



రాయచోటి టౌన్: దర్శనానికి క్యూలైన్‌లో మహిళలు



రామాపురం: ర్యాలీగా వస్తున్న భక్తులు



వీరబల్లెలో ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్



గాలివీడు: శ్రీరాముడి శోభాయాత్రకు తరలివచ్చిన భక్తులు

రాజంపేట టౌన్ : అయోధ్యలోని రామమందిరంలో బాలరాముడు కొలువుదీరిన సందర్భంగా సోమవారం దాదాపు అన్ని రామాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా బాలరాముడి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆయా ప్రాంతాల్లోని రామాలయాలను శోభాయమానంగా అలంకరించారు. వేకువజాము నుంచే ఆయా ప్రాంతాల్లోని ప్రజలు, భక్తులు రామాలయాలకు తరలివచ్చి విశేషంగా పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో సీతారాముల ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా చెక్కభజనలు, కోలాటాలు వేశారు. గ్రామోత్సవంలో భక్తులు కాషాయ జెండాలను చేతబూని రామనామస్మరణ చేస్తూ ముందుకు సాగారు. జయజయరామ, జానకీరామ అంటూ నృత్యాలు చేస్తూ భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనేక మంది తమ ఇళ్లపై శ్రీరాముడి చిత్రం ఉన్న జెండాలను కట్టారు. ఇంటిముంగిట దీపాలను వెలిగించారు. బాలరాముడి విగ్రహాన్ని రామమందిరంలో ప్రతిష్టించిన అద్భుతమైన ఘట్టాన్ని టీవీల్లో చూసిన సమయంలో రామభక్తులు ఆనందపరవశితులయ్యారు. ఏ నలుగురి కలిసినా అయోధ్య రాముడి గురించి మాట్లాడుకోవడం కనిపించింది.

ప్రతి ఒక్కరూ ధర్మ మార్గంలో నడవాలి

వీరబల్లె (రాయచోటి టౌన్) : శ్రీ రామచంద్రుడు చూపిన ధర్మ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలు తెలిపారు. సోమవారం వీరబల్లె మండల పరిధిలోని తాటిగుంటపల్లెలో శ్రీ రామాలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు. అలాగే షికారుపాలెంలో గంగమ్మ గుడికి భూమి పూజ జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ రామచంద్రుడు ధర్మమార్గంలో నడిచారని ఆయన చూపిన మార్గంలో మనందరం నడవాలని చెప్పారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : అయోధ్యలోని బాల రామ విగ్రహ ప్రాణ ప్రతిష్టను పురస్కరించుకొని సంబేపల్లె మండలంలో శ్రీరామ, ఆంజనేయ ఆలయాలు శ్రీరామ నామ స్మరణతో మార్మోగాయి. ఈ కార్యక్రమాన్ని వీక్షించుటకు వచ్చిన భక్తులను హనుమంతుని వేషధారణ ఆకట్టుకుంది. ఈ ప్రత్యేకమైన రోజును స్వామివారిని పూజించి అన్ని కార్యక్రమాలు నిర్వహించడం భక్తులకు పూర్వజన్మ సుకృతం. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందించడంతో పాటు వారికి భోజన సౌకర్యాన్ని కల్పించారు. అనంతరం ప్రత్యేక బృందంచే స్వామివారి వైభవాన్ని తెలుపుతూ గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రాయచోటిలో..

రాయచోటి టౌన్ : జై శ్రీ రాం.. జై శ్రీరాం అంటూ శ్రీ రామచంద్రుడి ఊరేగింపు వైభవంగా భారీ భక్త జనంతో పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా మార్మోగాయి. సోమవారం అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్టను పురస్కరించుకొని రాయచోటి నియోజకవర్గ పరిధిలోని అన్ని రామాలయాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ రామచంద్రుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం శ్రీ రామచంద్ర, సీత, లక్ష్మణ, ఆంజనేయ స్వామి వారిని అందంగా అలంకరించి భక్తుల దర్శన ఏర్పాటు చేశారు. తరువాత నిర్వహించిన ఊరేగింపులో భక్తులు చెక్కభజనలు, పండరి భజనలతో ఊరేగించారు. కొత్తపేట రామాలయం, ఎన్‌జీఓ కాలనీలో వెలసిన శ్రీ కోదండరామాలయం, మాసాపేట, చెన్నముక్కపల్లె శ్రీ రామాలయం ఇలా అన్ని విష్ణువు అలయాలలో స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి ఊరేగించారు.

ఘనంగా రామనామ సంకీర్తన

నందలూరు(రాజంపేట) : సుమారుగా 500 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ట మహోత్సవం జరుగుతున్న శుభ సందర్భంగా మండలంలోని నందలూరు గ్రామ పంచాయతీలో వెలసిన చెన్నకేశవ స్వామి ఆలయంలో సోమవారం ఎంబలూరు అనీల్ కుమార్, శ్రీను, జిసి సుబ్బరాయుడు, పల్లె నాగ మోహన్, రామచంద్ర ఆధ్వర్యంలో సీతారామ లక్ష్మణ ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూలతో అలంకరించి అభిషేకం నిర్వహించారు. అనంతరం రామనామ సంకీర్తనలు ఘనంగా ఆలపించారు. కార్యక్రమంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొని రామనామ సంకీర్తన గావించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైభవంగా దీపోత్సవం

మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలోని సచివాలయం సర్కిల్ వద్ద ఎంబలూరు నరసింహస్వామి, నారపుశెట్టి వేణుల ఆధ్వర్యంలో మహిళలు పెద్దఎత్తున దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉభయదారులు బాలాజీ శివశంకర్ కుటుంబ సభ్యులు శ్రీరాముల వారి చిత్రపటాన్ని ఇంటివద్ద నుంచి ఊరేగింపుగా ఉభయాన్ని (తీర్థప్రసాదాలు) తీసుకువచ్చి మంటపంపై ఏర్పాటు చేశారు. అనంతరం అర్చకులు బండాత్మకూరు శివకుమార్ శర్మచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మస్తానయ్య, అరిగె రాంబాబు, హరిబాబు, హెచ్‌డీ ప్రసాద్, మోడపోతుల రాము, అవినాష్ రెడ్డి, గెలివి మల్లికార్జున శెట్టి, కుర్ర మణి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో వేడుకలు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : అయోధ్యలోని బాల రాముని ప్రాణ ప్రతిష్ట సందర్భంగా ప్రతి గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనేక గ్రామాలలో శ్రీరాముని భక్తులు ర్యాలీలు నిర్వహించి పూజలు చేశారు. కంబాలకుంట బీసీ కాలనీ రామాలయం నుంచి గ్రామ సరిహద్దులో ఉన్న రాముని నిలువెత్తు కటౌట్ వద్ద హారతులు ఇచ్చి జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పి కొత్తపల్లిలో, దిగువ సిద్దవరం గ్రామంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

అంగరంగ వైభవంగా గ్రామోత్సవాలు

వీరబల్లె (రాయచోటి టౌన్) : అంగరంగ వైభవంగా శ్రీ రాములోరి గ్రామోత్సవం నిర్వహించారు. సోమవారం అయోధ్యలో బాలరాముడికి ప్రాణప్రతిష్ట చేస్తున్న క్రమంలో మండల పరిధిలోని అన్ని రామాలయాలలో శ్రీ రామచంద్రుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించి ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం జరిపారు. ఓదివీడులో భాజా భజంత్రీలతో చెక్కభజనలతో చిన్నారుల నృత్యాల నడుమ గ్రామోత్సవం ఘనంగా జరిగింది. అలాగే మాండవ్య నది ఒడ్డున వెలసిన శ్రీ రామాలయం ఆవరణలో భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ పెద్దలు విశపు మురళీ రెడ్డి,జగిలి రామచంద్రయ్య, మదనపల్లె రామచంద్ర, తుమ్మల ఓంప్రకాష్, పోరుమామిళ్ల చలపతి తదితరులు నిర్వహించారు.

అంబరాన్నంటిన సంబరాలు

చిన్నమండెం : అయోధ్య రామ మందిరంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా సోమవారం చిన్నమండెం మండల వ్యాప్తంగా సంబరాలు అంబరాన్నంటాయి. కొత్తపల్లె గ్రామంలోని రామాలయంలో సర్పంచ్ భూమసాని అంజలి, గ్రామ నాయకుడు హరినాథరెడ్డి రాముల విగ్రహానికి అభిషేకం చేశారు. మాజీ సర్పంచ్ చక్రపాణిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మిరెడ్డి, అంజి, మహేశ్వరరెడ్డి, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పలు గ్రామాల్లో వెలిసిన రామాలయాల్లో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా పెద్ద ఎత్తున భక్తాదులు పాల్గొన్నారు.

సిద్దవటంలో..

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామంలో వెలసిన శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం అయోధ్య రామాలయంలో శ్రీరాముని విగ్రహప్రతిష్టను పురస్కరించుకొని మాధవరం–1 గ్రామంలో శ్రీ సీతారామ, లక్ష్మణ ఆంజనేయ స్వాముల ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయం వద్ద నుంచి ఉత్సవ మూర్తులను అలంకరించి ట్రాక్టర్ రథంపై స్వాముల వారిని ఉంచి యువకులు, పెద్దలు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వారు, యువకులు పాల్గొన్నారు. మరికొన్ని గ్రామాల్లో ఊరేగింపు కార్యక్రమాలు, అన్నదానాలు, భజనలు వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : అయోధ్యలో వైభవంగా బాలరాముడి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో మండల వ్యాప్తంగా గ్రామాలు రామనామ స్మరణతో మార్మోగాయి. మండల కేంద్రంలో ఆర్యవైశ్యులు సంకీర్తనలు పాడుతూ రాముని చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించారు. శ్రీవాణి స్కూల్ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఏపీఎండీసీ కార్యాలయ ప్రాంగణంలో అయోధ్య రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్టను పురస్కరించుకొని ఏపీఎండీసీ అధికారులు శ్రీరాముని దేవాలయంలో ధ్వజస్తంభ స్థాపన, హోమం, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. సీపీఓ సుదర్శన్ రెడ్డి కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో మంగంపేట వైఎస్సార్‌సీపీ నాయకులు గుత్తిరెడ్డి హరినాథరెడ్డి, డీఆర్‌సీసీయూ మెంబర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి, రెవెన్యూ అధికారులు, ఏపీఎండీసీ అధికారులు, ఉద్యోగులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కనుల పండువగా శోభాయాత్ర

గాలివీడు : మండల కేంద్రంలో శ్రీరాముడి శోభాయాత్ర కనుల పండువగా సాగింది. సోమవారం అయోధ్య బాలరాముడు విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు రామాలయంలో విశేష పూజలు నిర్వహించారు. ముఖ్యంగా మండల కేంద్రంలోని గేటు వద్ద గల శ్రీ కోదండ రామాలయం ఎన్నడూ లేనివిధంగా భక్తజన సందోహంతో కిక్కిరిసిపోయింది. ఉదయం అర్చకులు నాగఫణి కిషోర్ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. మరోవైపు అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్టను ఎల్‌ఈడీ ద్వారా భక్తులు వీక్షించారు. మధ్యాహ్నం శోభాయాత్రలో ఉత్సవమూర్తులు గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి కీర్తనలతో భజన బృందాలు, చెక్కభజనలు, కోలాటాలు, శ్రీరామ, ఆంజనేయ వేషధారణలో అశేష జనవాహిని మధ్య అద్యంతం భక్తిపారవశ్యంతో తన్మయత్వానికి లోనయ్యేలా శోభయాత్ర సాగింది. ఉత్సవంలో పాల్గొన్న దాదాపు 5వేల మంది భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భోజన వసతిని ఏర్పాటు చేశారు.



పెనగలూరు మండలంలో శ్రీరాముడి భారీ కటౌట్ ఏర్పాటు చేసిన దృశ్యం



సిద్దవటం మండలం మాధవరం-1 గ్రామంలో..



ఓబులవారిపల్లె: ఏపీఎండీసీ కార్యాలయంలో..

రామాపురంలో..

రామాపురం : మండల కేంద్రంలోని హరిహరాలయంలో సోమవారం జరిగిన బాల రాముడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని లైవ్ షోలు చూపించారు. అనంతరం శ్రీరామ పటాన్ని హరిహరాలయం నుంచి చర్చి వరకు, అక్కడి నుంచి మూడు రోడ్ల కూడలి వరకు విశ్వహిందూ పరిషత్ మండల గౌరవ అధ్యక్షులు ప్రసాద్‌రెడ్డి, భజరంగ్‌దళ్ సహ సంయోజక్ వీరారెడ్డి, ఉపాధ్యక్షులు దామోదర్ నాయుడు, మండల అధ్యక్షులు ఆంజనేయులు, సహాయ కార్యదర్శి బలరాంల ఆధ్వర్యంలో ఊరేగింపుగా జైశ్రీరామ్ అంటూ శ్రీరామ నామంతో మండలం మార్మోగింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని అన్ని గ్రామాలలోని రామాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

అనంతంపల్లిలో..

పుల్లంపేట : అయోధ్య రామ మందిరంలో రాముని విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకొని మండల పరిధిలోని అనంతంపల్లి రామాలయంలో రాములవారి ఊరేగింపు కనుల పండువగా జరిగింది. జై శ్రీరామ్ అనే నినాదాలతో డప్పు వాయిద్యాల మధ్య బాణాసంచ పేల్చుతూ ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు.

చిట్వేలిలో..

చిట్వేలి : అయోధ్యలో బలరాముడి విగ్రహ ప్రతిష్టలో భాగంగా చిట్వేలి మండలంలో ఊరూవాడలు రామకీర్తనలతో మార్మోగాయి. ఈ మేరకు సోమవారం రామ మందిరాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రాహ్మణ వీధి, అభయాంజనేయ స్వామి సింగనమల వీధి, కోదండరామస్వామి ఆలయం, కొత్త బస్టాండ్‌లోని ఆలయం, స్థానిక అమ్మవారిశాలల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని, గ్రామోత్సవాలు నిర్వహించారు. మండల పరిధిలోని అన్ని రామ మందిరాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



రాజంపేట టౌన్: ఉత్సవమూర్తుల గ్రామోత్సవం



చిట్వేలిలో గ్రామోత్సవ దృశ్యం



రాజంపేట టౌన్: గ్రామోత్సవంలో రామభక్తులు



నందలూరులో సంకీర్తనలు ఆలపిస్తున్న మహిళలు

ప్రతిపక్షాల విమర్శలకు అభివృద్ధే సమాధానం

రాయచోటి అర్బన్ : రాయచోటి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులే ప్రతిపక్ష నేతల విమర్శలకు సమాధానాలు చెబుతాయని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా అన్నారు. సోమవారం రాయచోటి సమీపంలోని ఎగువ అబ్బవరం వద్ద 85 ఎకరాలలో నిర్మిస్తున్న నగరవనం పనులను, మహిళా డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను ఆయన అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులు తమ ఉనికికే ప్రమాదకరంగా మారినట్లుగా ప్రతిపక్ష పార్టీల నేతలు ఉలిక్కి పడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లోనూ తమకు భవిష్యత్తు ఉండదన్న భయంతో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిపై పసలేని ఆరోపణలు చేస్తున్నారంటూ తెలిపారు. నీతి, నిజాయితీగా, నిజమైన ప్రజాసేవకుడిగా నియోజకవర్గం అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ, సహకారాలతో శ్రీకాంత్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. టీడీపీ టికెట్ రేసులో ఉన్న నేతలంతా ఆ పార్టీ అధిష్టానం మెప్పుపొందేందుకు, ఎలాగైనా టికెట్ దక్కించుకోవాలనే ఉద్దేశంతో శ్రీకాంత్‌రెడ్డిపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. నగర వనం నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. ఈ నెలాఖరుకు ఎమ్మెల్యే చేతులమీదుగా నగరదనం ప్రారంభించేందుకు సిద్ధ చేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే సహకారంతో బాలికల ఉర్దూ డిగ్రీ కళాశాలకు రూ.20లక్షల అంచనాతో ప్రత్యేక గదుల నిర్మాణం పనులు చేపడుతున్నామన్నారు.



నగరవనంలో జిమ్ పరికరాల ఏర్పాటును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు చారిత్రాత్మకం

రాజంపేట : విజయవాడ నగరం నడిబొడ్డున భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డా. బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేయడం చారిత్రాత్మకమని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి అన్నారు. సోమవారం రాజంపేటలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే భారీ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్సార్ కుటుంబానికి దళితులు, మైనార్టీ, బీసీలు అండగా నిలుస్తున్నారన్నారు. దీన్ని జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు దిగజారుడు రాజకీయాలతో లేనిపోని ఆరోపణలు, విమర్శలు గుప్పిస్తున్నారన్నారు. 2024లో మళ్లీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తథ్యమన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన, తప్పుడు కథనాలు ఎల్లో మీడియాలో రాసుకున్న, వాటిని ప్రజలు నమ్మడంలేదన్నారు.

భద్రకాళి సమేతుడికి పల్లకీ సేవ

రాయచోటి టౌన్ : శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించి అందంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, పూజలు నిర్వహించి పూలు, పట్టు వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి పల్లకీలో ఉంచి భక్తుల సమక్షంలో ఆలయ మాఢ వీధులలో ఊరేగించారు. ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



పల్లకీలో ఊరేగుతున్న భద్రకాళి సమేతుడు

రేడియం స్టిక్కర్స్ తప్పనిసరి

రాజంపేట : వాహనాలకు రేడియం స్టిక్కర్స్ తప్పనిసరి అని రాజంపేట ఎంవీఐ వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణ శివార్లలోని వై జంక్షన్ వద్ద వాహన తనిఖీలను రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి వేళల్లో వెనుకవచ్చే వాహనాలకు రేడియం స్టిక్కర్స్ ద్వారా వాహనం ఉందని గుర్తించగలరన్నారు. అప్పుడు ప్రమాదాలు జరగకుండా ఉంటాయన్నారు. ఎస్ఐ భక్తవత్సలం మాట్లాడుతూ ఇంటి నుంచి బయటికి వచ్చిన తర్వాత క్షేమంగా ఇంటికి చేరాలంటే వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు.

వలంటీర్ల ద్వారా అవగాహన కల్పిస్తాం

రాయచోటి టౌన్ : వాహనదారులకు ప్రత్యేకంగా ఎంపిక చేసిన వలంటీర్ల ద్వారా అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు రాయచోటి వాహనాల తనిఖీ అధికారులు తెలిపారు. సోమవారం జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా ప్రత్యేకంగా వాహనదారులకు అవగాహన కల్పించడానికి వలంటీర్లను ఎంపిక చేశామన్నారు. వలంటీర్లకు శిక్షణ ఇచ్చి వారి ద్వారా వాహనదారులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

అర్జీదారులకు భోజనం

రాయచోటి టౌన్ : జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అర్జీలు అందించేందుకు వచ్చిన వారికి అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా భోజనం అందించారు. కార్యక్రమం 45 వారానికి చేరుకుంది. సహకరిస్తున్న దాతలను ఎమ్మెల్యే అభినందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

రామాపురం : మండలంలోని విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం పీఆర్టీయూ 2024 క్యాలెండర్‌ను ఎంఈఓలు రామకృష్ణుడు, జయచంద్రలు, ఎస్ఐ బి.ఎల్. ప్రసాద్‌రెడ్డి చేతులమీదుగా సోమవారం పీఆర్టీయూ క్యాలెండర్‌ను మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీఆర్టీయూ మండల అధ్యక్షులు పిచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామచంద్ర, జిల్లా బాధ్యులు ఆంజనేయులు, కుమారస్వామి, రాణికుమారి, మనోహర్, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్..

రాయచోటి టౌన్ : ఏపీఎస్ఈబీ ఎస్సీ/ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీని రాయచోటి ఏపీఎస్పీడీసీఎల్ ఏడీ చంద్రశేఖర్ రెడ్డి ఆవిష్కరించారు. సోమవారం రాత్రి ఆయన కార్యాలయంలో డైరీ ట విడుదల చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ డివిజన్ అధ్యక్షులు చంద్రశేఖర్, కార్యదర్శులు పాల్గొన్నారు.